పంటు సేవలు షురూ..

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణం - సఖినేటిపల్లి గ్రామాల మధ్య ప్రజా రవాణా చేసే పంటు సేవలను సోమవారం నుంచి అధికారులు పునరుద్ధరించారు. గోదావరికి వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో అధికారులు గత బుధవారం సాయంత్రం నుండి పంటు సేవలు నిలిపివేశారు. గోదావరికి వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో తిరిగి వాటి పునర్ధురణకు అనుమతిచ్చామని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వికె.వీరభద్రరావు తెలిపారు. దీంతో నిర్వాహకులు పంటు సేవలు పునరుద్ధరించారు.

ప్రారంభమైన పంటు రాకపోకలు

'నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన నెరుసు శ్రీనివాసరావు నాలుగెకరాలు కౌలుకు తీసుకుని వరిసాగు చేశారు. ఇటీవల వరదలకు పెదచెరువు గండిపడి రెండెకరాల పంట ముంపునకు గురై దెబ్బతింది. రైతు శ్రీనివాసరావుకు అధికారులు కౌలుకార్డు కూడా ఇవ్వలేదు. ఎకరాకు రూ.20 వేలు చొప్పున పెట్టుబడి పెట్టడంతో రూ.40 వేలు వరకూ రైతులు నష్టపోయారు. పంట నష్టపరిహారం వస్తుందో, లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం పంట నష్టపోయిన కౌలురైతు శ్రీనివాసరావుకు పరిహారం ఇస్తుందా అనే అనుమానం నెలకొంది.

నూజివీడులో పెదచెరువుకు గండిపడి కౌలురైతు కాటూరి శ్రీనివాసరావుకు చెందిన రెండెకరాల్లో వరి పంట పూర్తిగా దెబ్బతింది. దాదాపు రూ.40 వేలు వరకూ రైతు నష్టపోయాడు. అధికారులు కౌలుకార్డు ఇవ్వకపోవడంతో పంట నష్టపరిహారం అందజేతపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలని, లేకపోతే తమ కుటుంబం పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందని కౌలురైతు శ్రీనివాసరావు లబోదిబోమంటున్నాడు.

కౌలు రైతులే బాధితులు..!

వరుస విపత్తులతో కోలుకోలేని స్థితిలోకి కౌలురైతులు

కౌలుకార్డులు ఇవ్వకపోవడంతో పంటనష్టంపై నీలినీడలు

ప్రతియేటా ఇదే పరిస్థితి.. సాగుదారుని గురించి పట్టని పాలకులు

ప్రస్తుత ఖరీఫ్‌లో ఇప్పటికే 20 వేల ఎకరాల్లో పంటనష్టం

పంట నష్టపరిహారం మళ్లీ భూయజమానులకేనా?

నూజివీడులో పెదచెరువుకు గండిపడడంతో దెబ్బతిన్న పంటపొలం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కౌలురైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. ఏఒక్క కౌలురైతునూ పలుకరించినా కన్నీటిపర్యంతమవుతున్న పరిస్థితి ఉంది. ప్రస్తుత ఖరీఫ్‌లో రెండు సార్లు భారీవర్షాలు, వరదలు విరుచుకుపడటంతో కౌలురైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. రెండు జిల్లాలవ్యాప్తంగా ఖరీఫ్‌లో నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తుండగా 80 శాతం సాగు కౌలురైతులే చేస్తున్నారు. రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇందులో సగం మందికి కూడా ప్రభుత్వం కౌలుకార్డులు ఇవ్వలేదు. జారీ చేసిన కార్డుల్లో ఎన్ని అర్హులకు అందాయో కూడా తెలియని పరిస్థితి ఉంది. వరదలకు పంట నష్ట బాధితులంతా కౌలురైతులే ఉన్నారు. రెండుసార్లు విరుచుకుపడిన వరదలకు జిల్లాలో దాదాపు 20 వేల ఎకరాల వరకూ వరిపంట దెబ్బతింది. జులైలో వరదలకు రెండు జిల్లాల్లో రూ.11 కోట్లు పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు తేల్చారు. ప్రస్తుత వరదలకు దాదాపు 14 వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఒక నూజివీడు డివిజన్‌లోనే ఆరు వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. కౌలురైతులకు కౌలుకార్డులు ఇవ్వకపోవడంతో పంట నష్టపరిహారం అందజేతపై నీలినీడలు అలుముకున్నాయి. ఇ-క్రాప్‌లో పేరు నమోదైతే తప్ప పంట నష్టపరిహారం అందే పరిస్థితి ఉండదు. ఇ-క్రాప్‌లో భూయజమానుల పేర్లనే అధికారులు నమోదు చేస్తున్నారు. దీంతో పంట నష్టపరిహారం కౌలురైతులకు ఇచ్చే పరిస్థితి కన్పించడం లేదు. ప్రభుత్వం పంట కోల్పోయిన కౌలురైతుల పేర్లను నమోదు చేసి నష్ట పరిహారం అందజేతకు చర్యలు తీసుకోవాలని పంట దెబ్బతిన్న రైతులు కోరుతున్నారు. గడిచిన ఐదేళ్లలో ప్రతియేటా రెండు జిల్లాల పరిధిలో వరదలు, భారీవర్షాలకు పెద్దఎత్తున పంటలు దెబ్బతిన్నాయి. పంట నష్టపరిహారం మాత్రం భూయజమానుల జేబుల్లోకే వెళ్లిపోయాయి. బీమా పరిహారం సైతం యజమానుల ఖాతాల్లోకే చేరింది. దీంతో కౌలురైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు సైతం చోటుచేసుకున్నాయి. ఆత్మహత్య చేసుకున్న పలువురు కౌలురైతుల కుటుంబాలకు జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అప్పట్లో రూ.లక్ష చొప్పున సాయం సైతం అందించారు. ఇప్పుడు ఆయనే డిప్యూటీ సిఎంగా ఉన్నారు. పంటనష్ట నమోదు జాబితాలో కౌలురైతుల పేర్లు నమోదు చేసి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటారో.. లేదో వేచిచూడాలి.

అరకొరగా కౌలుకార్డులు జారీ

రెండు జిల్లాల్లో కౌలుకార్డుల జారీ ప్రక్రియ అరకొరగానే సాగింది. నూజివీడులో పంట నష్టపోయిన కౌలురైతుల్లో మూడొంతుల మందికి కౌలుకార్డులే లేకుండా పోయాయి. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉంది. జారీ చేసిన కౌలుకార్డులు సైతం అర్హులకు చేరాయా అనే అనుమానాలు సైతం నెలకొన్నాయి. భూయజమానితో సంబంధం లేకుండా కౌలుకార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అటువంటి పరిస్థితి లేకుండాపోయింది. 2019 పంటహక్కు సాగుదారుని చట్టంలో మార్పులు చేస్తే తప్ప భూయజమానితో సంబంధం లేకుండా కౌలుకార్డులు జారీ చేయలేమంటూ అధికారులు చెబుతున్నారు. ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ విఆర్‌ఒ సంతకంతో కౌలుకార్డులు జారీ చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పిన పరిస్థితి నెలకొంది. క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధమైన పరిస్థితి నెలకొంది. కౌలుదారులందరికీ కౌలుకార్డులు అందజేయడంతోపాటు పంట నష్టపరిహారం అందించినప్పుడే వాస్తవ సాగుదారులకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది.

ఉప్పుటేరు వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎలు, కలెక్టర్

ఉప్పుటేరు వద్ద ఇబ్బంది లేకుండా చర్యలు

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - ఆకివీడు

ఉప్పుటేరు వద్ద కొల్లేరు వరద నీటి ఇబ్బంది లేని విధంగా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సరిహద్దులోని ఆకివీడు మండలం దుంపగడప వద్ద ఉప్పుటేరులో గుర్రపుడెక్క, కిక్కిస తొలగింపు పనులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మీ, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, కైకలూరు ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. కొల్లేరు నీరు ఉప్పుటేరు ద్వారా మాత్రమే సముద్రంలో కలుస్తోందన్నారు. కొల్లేరు ఉప్పుటేరు వద్ద కలిసే ప్రాంతంలో నీటి ప్రవాహానికి కిక్కిస అడ్డంకిగా ఏర్పడిందన్నారు. ఉప్పుటేరు రైల్వే బ్రిడ్జి, ఆర్‌అండ్‌బి బ్రిడ్జి దిగువ భాగంలో జరుగుతున్న కిక్కిస తొలగింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కొల్లేరులో నీటి మట్టం క్రమంగా పెరుగుతూ సరిహద్దు మండలం ఆకివీడులోని సిద్ధాపురం, చినమిల్లిపాడు గ్రామాల వద్ద పంట పొలాల్లోకి చొచ్చుకొస్తున్న వరద నీటిని వారు పరిశీలించారు. ఆకివీడు వద్ద ఉప్పుటేరు గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఎంఎల్‌ఎలు రఘురామకృష్ణంరాజు, కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ఉప్పుటేరులో యుద్ధప్రాతిపదికన పొక్లెయిన్‌తో గుర్రపుడెక్క, మేటలు తొలగించడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. వారం రోజులుగా ఉప్పుటేరులో మేటల తొలగింపు చర్యలు చేపట్టారన్నారు. రైల్వే వంతెన వద్ద, ఆర్‌అండ్‌బి వంతెన వద్ద గుర్రపుడెక్క మేటలను తొలగిస్తున్నారన్నారు.

ఇరిగేషన్ సహాయ ఇంజినీర్ వెంకటేశ్వరరావుకు కలెక్టర్ అభినందనలు

ఉప్పుటేరును ఆనుకుని ఉన్న గ్రామాలు భారీ వరద ముంపునకు గురికాకుండా ముందస్తుగా పది రోజులుగా ఉప్పుటేరులో కిక్కిస తొలగింపు పనులను ప్రారంభించి దబరాల ద్వారా తొలగింపు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ముందస్తు చర్యలు చేపట్టడంలో శ్రద్ధ వహించిన ఇరిగేషన్ సహాయ ఇంజినీర్ వెంకటేశ్వరరావును కలెక్టర్ శాలువా కప్పి ప్రత్యేకంగా అభినందించారు. వారి వెంట జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మీ, జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా జలవనరుల శాఖ అధికారి పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎఇ వెంకటేశ్వరరావు, ఆకివీడు తహశీల్దార్ ఉన్నారు.

చినమిల్లిపాడు మెడికల్ క్యాంపు తనిఖీ

ఉప్పుటేరు కారణంగా ముందస్తుగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులు, నవజాత శిశువుల తల్లులను అవసరమైతే ముందస్తుగా ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించాలని సూచించారు. ఆమె వెంట డిఎంహెచ్‌ఒ డి.మహేశ్వరరావు, పెదకాపవరం మెడికల్ ఆఫీసర్ రాజశేఖర్, ఎఎన్‌ఎంలు, ఆశాలు ఉన్నారు.

గుండెపోటుతో సిపిఎం నేత రాము మృతి

నరసాపురం: సిపిఎం నరసాపురం పట్టణ కమిటీ సభ్యులు, సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము (బాబాయ్) సోమవారం గుండెపోటుతో మరణించారు. వైజాగ్‌లోని తమ బంధువుల ఇంట్లో ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లిన ఆయన గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు వారి బంధువులు తెలిపారు. అంత్యక్రియలు మంగళవారం నరసాపురంలో జరుగుతాయని బంధువులు తెలిపారు. ఆయన మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజా రామ్మోహన్‌రాయ్ సంతాపం తెలిపారు. పొన్నాడ రాము 1984లో అటుకుల మిల్లు కార్మికునిగా చేరి యూనియన్‌లో చేరారు. 1986లో డివైఎఫ్ఐ టౌన్ అధ్యక్షునిగా పనిచేశారు. అనంతరం సిఐటియు నరసాపురం డివిజన్ కమిటీ సభ్యులుగా పనిచేశారు. పలు నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు, పార్టీ, ప్రజాసంఘాల కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా ఉండేవారు. కార్మికుల ఇళ్ల స్థలాల కోసం చేపట్టిన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ప్రస్తుతం సిఐటియు పట్టణ కార్యదర్శిగా, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులుగా పనిచేస్తున్నారు.ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పొన్నాడ రాము (బాబాయ్) (ఫైల్‌ఫొటో)

ఉపాధ్యాయుల పని సర్దుబాటు ఇబ్బందులు తొలగించాలి

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఉపాధ్యాయుల పని సర్దుబాటు ఇబ్బందులు తక్షణం తొలగించాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీ కోరారు. కలెక్టరేట్లో యుట్యూబ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఎడి సత్యనారాయణకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గోపీ మాట్లాడుతూ సీనియర్, జూనియర్ సమస్యలు పరిష్కరించాలన్నారు. సుదూర ప్రాంతాలకు పని సర్దుబాటు చేసిన వారికి, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి మినహాయింపు ఇవ్వాలన్నారు. సంబంధింత సబ్జెక్టు లేకున్నా కన్వర్షన్‌తో పని సర్దుబాటు చేశారని అటువంటి వాటిని పరిష్కరించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మాట్లాడుతూ గతంలో జిల్లాలో చేసిన పని సర్దుబాటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పని సర్దుబాటు సమస్యలు పరిష్కరించాలని అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతోందని ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు కె.రామకృష్ణ ప్రసాద్, డి.ఏసుబాబు, జి.రామకృష్ణ రాజు, భీమవరం పట్టణ అధ్యక్షులు ఎస్ గోవింద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాశాఖ ఎడికి వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నేతలు

రైతులను ఆదుకుంటాం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - నరసాపురం

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం, అధిక వర్షాలతో నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామని ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ రైతులకు భరోసా ఇచ్చారు. సోమవారం మండలంలోని రుస్తుంబాద గ్రామంలో నీటమునిగి దెబ్బతిన్న సార్వా చేలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా నారు మడులు పోయిన రైతులకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించామన్నారు. నియోజకవర్గంలో 3 వేల ఎకరాల్లో సార్వాసాగు చేపట్టగా 1617 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, ప్రతి ఎకరాకూ రూ.6,800 పరిహారం అందిస్తున్నామని తెలిపారు. వచ్చే వేసవిలో నియోజకవర్గంలో పంట, మురుగు కాలువలను ప్రక్షాళన చేస్తామన్నారు. ఆయన వెంట ఎంపిపి ఎం.సోని, ఎడి అనిల్‌కుమార్, తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి ఉన్నారు.

మొగల్తూరు : అధిక వర్షాల కారణంగా నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. సోమవారం మొగల్తూరులో నీట మునిగి దెబ్బతిన్న చేలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా నారు మడులు పోయిన రైతులకు 80 శాతం రాయితీపై విత్తనాలు అందించామన్నారు. వచ్చే వేసవి నాటికి నియోజకవర్గంలో పంట, మురుగు కాలువలు ప్రక్షాళన చేస్తామన్నారు. ఆయన వెంట ఎడి అనిల్ కుమార్, తహశీల్దార్ సిహెచ్ విద్యాపతి, నాయకులు ఉన్నారు.

మొగల్తూరు : కుళ్లిన నాట్లను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ నాయకర్

లారీ యజమానులు సహకరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఉచిత ఇసుకను వినియోగదారులకు సరసమైన రవాణా ఛార్జీలతో అందించేందుకు టిప్పర్లు, లారీల యజమానులు సహకరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ జిల్లాలోని టిప్పర్లు, లారీ ఓనర్స్ అసోసియేషన్స్‌తో సమావేశమై ఉచిత ఇసుక రవాణా ఛార్జీలపై సమీక్షించి మాట్లాడారు. ప్రజలందరికీ ఉచిత ఇసుకను అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో నూతన ఇసుక పాలసీని ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. జిల్లాలో ప్రస్తుతానికి ఇసుక అందుబాటులో లేదని, బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లా నుండి అందుబాటులో ఉన్న ఇసుకను పొందేందుకు అవకాశం ఉందన్నారు. కిలోమీటరుకు రవాణా ఛార్జీలను నిర్ణయించామని కలెక్టర్ తెలిపారు. 18 టన్నుల కెపాసిటీ కలిగిన 10 టైర్ల లారీకి 40 కిలోమీటర్ల వరకూ రూ.10, నలభై కిలోమీటర్లు కిలోమీటర్లు పైబడి ప్రతి కిలోమీటరుకూ రూ.8 చొప్పున, పది టన్నుల ఆరు టైర్ల లారీకి 40 కిలోమీటర్ల వరకూ రూ.11, నలభై కిలోమీటర్ల పైబడి కిలోమీటర్ ఒక్కింటికీ రూ.8 లు, నాలుగున్నర టన్నుల కెపాసిటీ కలిగిన ట్రాక్టర్ ట్రాలీకి 40 కిలోమీటర్ల వరకూ రూ.15, నలభై కిలోమీటర్ల పైబడి ప్రతి కిలో మీటర్‌కూ రూ.6లు చొప్పున రవాణా ఛార్జీలు నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు, జిల్లా రవాణా అధికారి పి.ఉమామహేశ్వరరావు, జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి జి.జయప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ముందస్తు చర్యలు తీసుకోవాలి

యనమదుర్రు డ్రెయిన్‌ను పరిశీలించిన జెసి

ప్రజాశక్తి - ఉండి

యండగండి లాకులు, బ్రిడ్జి, ప్రధాన కాలువను సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ప్రస్తుతం లాకుల షట్టర్లు, గేట్లు పనితీరు ఎలా ఉన్నదనేదానిపై ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. యనమదుర్రు మొదటి ప్రమాద హెచ్చరిక 29 అడుగులు కాగా 29.2 అడుగులు చేరి మొదటి ప్రమాద హెచ్చరిక నడుస్తోందని తెలిపారు. నీటిమట్టం 31 అడుగులకు పెరిగితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తామని జల వనరుల శాఖ అధికారులు జిల్లా జాయింట్ కలెక్టరుకు తెలిపారు. జెసి మాట్లాడుతూ రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయకముందే ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ గట్లు బలహీనంగా ఉన్నాయో ముందుగానే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, గండ్లు పడకుండా పంట పొలాల్లోకి నీరు చేరకుండా అన్ని చర్యలూ తీసుకోవాలని తెలిపారు. ఇసుక బస్తాలు, వెదురు కర్రలు, వెదురు తడికలు సిద్ధం చేసుకోవాలన్నారు. రెవెన్యూ, వ్యవసాయ, వైద్య ఆరోగ్య, పోలీసు, పశుసంవర్ధక, మత్స్య, అగ్నిమాపక దళ, విద్యుత్, పంచాయతీ రాజ్ తదితర శాఖలు తదుపరి చర్యలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎంపిడిఒ ఎస్.రవీంద్ర, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎం.రఘు, జల వనరుల శాఖ సహాయక ఇంజినీర్లు ఎ.వెంకటేశ్వరరావు, బిహెచ్.రవిప్రసాద్‌రాజు ఉన్నారు.

గణపవరం : యనమదుర్రు డ్రెయిన్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం పిప్పరలో సంబంధిత అధికారులతో కలిసి పిప్పర వంతెన వద్ద కాలువ ఉధృతిని పరిశీలించారు. అనంతరం నీటమునిగిన పొలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు బలహీనంగా ఉన్న గట్లను ముందుగానే క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. మండలంలో 446 మంది రైతులకు సంబంధించి 1,082 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు గుర్తించామని తెలిపారు. నష్టం అంచనాలపై గ్రామంలో సభలు నిర్వహించి నివేదిక అందజేస్తామని అధికారులు జెసికి తెలిపారు. ఆయన వెంట తహశీల్దార్ వైకెవి.అప్పారావు, ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి, వ్యవసాయాధికారి వైవిఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

తణుకు రూరల్ : యనమదుర్రు డ్రెయిన్ పరిధిలో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయకముందే ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. యండగండి డ్రెయిన్‌కు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో ఆయన అత్తిలి మండలం తిరుపతిపురం, తణుకు మండలంలో దువ్వ గ్రామల వద్ద ఉన్న లాకులను, ప్రధాన కాలువను, పంట పొలాలను అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వరద ఉధృతి మరింత పెరిగి రెండో ప్రమాద హెచ్చరికలు జారీ చేయడానికి ముందే లాకులు, గేట్లు పనితీరు చూసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది వంతుల వారీగా ప్రత్యేక విధులు నిర్వహించాలన్నారు ఆయన వెంటన ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ బి.సూర్యనారాయణ రెడ్డి, తణుకు తహశీల్దార్ అశోక్ వర్మ, ఎంపిడిఒ కిరణ్ ఉన్నారు.

ఆచంట : ఆచంట వేమవరంలో ముంపునకు గురైన పంట పొలాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వర్షాల కారణంగా, నక్కల డ్రెయిన్ వల్ల దెబ్బతిన్న వరిచేలను గుర్తించి పంట నష్టం జాబితా తయారు చేయాలని రైతు సేవా కేంద్రం ఇన్‌ఛార్జిలను ఆదేశించారు. నష్టపోయిన రైతులు త్వరితగతిన పాస్‌బుక్ లేదా కౌలు రైతు కార్డు జిరాక్స్ అకౌంట్ జిరాక్స్ రైతు సేవా కేంద్రంలో అందజేయాలని కోరారు. పాలకొల్లు ఎడిఎ అడ్డాల పార్వతి మాట్లాడుతూ ఇ పంట నమోదు ఈ నెల 15వ తేదీలోపు పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మండల వ్యవసాయ అధికారి బి.నాగరాజు, రైతు సేవా కేంద్రం ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

యనమదుర్రు కాలువను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న జెసి

ఆచంట వేమవరంలో పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ జిల్లా అధికారి వెంకటేశ్వరరావు

పోరాట యోధుడు ఆర్‌ఎస్

ప్రజాశక్తి - పెనుగొండ

గొప్ప పోరాట యోధుడు ఆర్ సత్యనారాయణ రాజు అని సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించి ఆర్‌ఎస్ చిత్రపటానికి సిపిఎం నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఆర్‌ఎస్ తుది శ్వాస వరకూ పార్టీ విషయాలు ఎప్పటికప్పుడు ఆసక్తిగా తెలుసుకునే వారన్నారు. విద్యార్థి దశ నుంచే స్వాతంత్రోద్యమంలో పాల్గొని జైలు జీవితం అనుభవించారన్నారు. కమ్యూనిస్టు పార్టీ విప్లవ సిద్ధాంతాలకు ఆకర్షితుడైన ఆర్‌ఎస్ తన యావత్ జీవితాన్ని సిపిఎం పార్టీకి అంకితం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో షేక్ పాదుషా, నీలాపు ఆదినారాయణ, శీలం ఏసు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

నేడు, రేపు కవిటంలో సిపిఎం జిల్లా స్థాయి సమావేశాలు

ప్రజాశక్తి - ఆచంట

ఈ నెల 10, 11 తేదీల్లో పోడూరు మండలం కవిటం వంతెన పక్కన పరశు రామారెడ్డి కళ్యాణ మండపంలో సిపిఎం జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడారు. సిపిఎం అనునిత్యం ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తోందన్నారు. ఈ సమావేశాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటన

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మున్సిపాలిటీలోని ముంపు ప్రాంతాలు 2, 15, 29 వార్డుల్లో సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పర్యటించారు. ముంపు ప్రాంతాల్లో వర్షపు, మురుగు నీటిని విద్యుత్ మోటార్ల ద్వారా తోడించాలని సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. నీళ్లను తోడిన తర్వాత సీజనల్ వ్యాధులు రాకుండా బ్లీచింగ్ చల్లాలని, మురుగు డ్రెయిన్లలో ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ మణి పాల్గొన్నారు.

ఎంఎల్ఎ నాయకర్‌కు సన్మానం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణంలోని 14వ వార్డు అంకానివారి వీధి దర్గారోడ్డులో వినాయక చవితి 22వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం గణనాథుడికి ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణేష్ యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎంఎల్ఎను గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

డాక్టర్ ఎం.నవ్యజీవన్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్, డాక్టర్ ఎం.నవ్య జీవన్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులను తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా పిహెచ్‌సికి తరలించి, ఎత్తు, బరువు, బిపి, రక్త పరీక్షలు, నిరుడు పరీక్షలు, హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి రక్తహీనత గల వారికి ఐరన్, సుక్రోజ్ సెలైన్ ద్వారా ఇప్పించారు. డాక్టర్ నవజీవన్ మాట్లాడుతూ గర్భిణులకు ప్రమాదకర లక్షణాలను గుర్తించి ప్రసవానికి వారం రోజుల ముందు ఏరియా హాస్పిటల్‌కు తరలించడం జరుగుతుందని తెలిపారు. సాధారణ ప్రసవాలు లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేస్తున్నామని అన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ సత్యవాణి, మంగ, అంగన్వాడీ కార్యకర్తల ద్వారా గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, పిహెచ్ఎన్ పి ఎలిజబెత్, సూపర్వైజర్లు డి.కమల, ఎన్‌కె.అమలేశ్వరరావ్, ఫార్మసిస్ట్ స్వామి, స్టాఫ్‌నర్సులు ముత్యవల్లి, సౌజన్య, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కచ్చా డ్రెయిన్లు తవ్వించాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గ్రామంలో కచ్చా డ్రెయినేజీలు తవ్వించి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలో సోమవారం తోకతిప్ప గ్రామంలో సిపిఎం బృందం పర్యటించారు. రోడ్లు, వాటర్ ట్యాంక్, ఫిల్టర్ బెడ్ల పరిశీలించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంచినీళ్ల ఫిల్టర్ కావడం లేదు, కనీసం వాడుకోవడానికి కూడా పనికిరాని విధంగా ఉన్నాయని, దురదలు వస్తున్నాయని ప్రజలు సిపిఎం బృందం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు మంచినీళ్ళ ఫిల్టర్ చేసి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, రోడ్లపైన నీరు నిలవ లేకుండా కచ్చా డ్రెయినేజీలు తవ్వించాలని, వైరల్ జ్వరాలు, మలేరియా, డెంగీ వ్యాధులు వ్యాప్తి చెందకుండా దోమల నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొడ్డు లక్ష్మీపతి, పొన్నమండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ అపుస్మా ఆధ్వర్యాన తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేంద్ర భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొని ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాలకొల్లు అర్బన్ గ్లోబల్ స్కూల్ ఉపాధ్యాయుని ప్రిన్సిపల్ పోకిరెడ్ల ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డుతో సత్కరించి అభినందించారు. ఉపాధ్యాయుల దీక్ష దక్షతలతో, విద్యార్థుల భావి జీవితాలను తీర్చిదిద్దాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ స్కూల్ ప్రిన్సిపల్ ఎంపీ జానకిరామ్, మాంటిసోరి స్కూల్ కరస్పాండెంట్ మద్దాల రాంప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీసూర్య అధ్యాపకునికి డాక్టరేట్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం శ్రీసూర్య విద్యా సంస్థలలోని అధ్యాపకుడు గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ డిగ్రీ అందుకున్నారు. శ్రీసూర్య విద్యా సంస్థల తెలుగు, సంస్కృత విభాగంలో అధ్యాపకునిగా విధులు నిర్వహిస్తున్న ఆర్.సతీష్, గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో డాక్టర్ ఎన్.వి.కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత మహీధర రామ మోహనరావు సాహిత్యంలో సామ్యవాద స్పృహ అనే అంశంపై పరిశోధన చేసి పిహెచ్‌డిని అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసినటువంటి అభినందన కార్యక్రమంలో శ్రీసూర్య విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మంతెన బ్రహ్మాజీ మాట్లాడుతూ అధ్యాపకులు నిరంతర విద్యార్థులను ప్రోత్సహించాలని ఇలాంటి గొప్ప ప్రయత్నాలు సాధించడానికి వీలవుతుందని, ఇలాంటి ప్రయత్నాలు ఉన్నవారికి మా ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మంతెన బ్రహ్మాజీ, డిగ్రీ ప్రిన్సిపల్ పి.పుల్లారావు, డిగ్రీ అకడమిక్ ప్రిన్సిపల్ టి.కృష్ణ గుప్తా, అకడమిక్ అడ్వైజర్ బోయ రామచంద్రారెడ్డి, డాక్టర్ ఫాజిల్, డాక్టర్ జానకి రామ్ పాల్గొన్నారు.

మామిడి చెట్టుకు విషపుటీగల గూడు

తొలగించాలని స్థానికుల వేడుకోలు

నరసాపురం: నరసాపురం పట్టణంలోని 15వ వార్డు లో ఉన్న మామిడి చెట్టుకు విషపు ఈగల పట్టుగూడు కట్టుకుంది. ఈ ఈగలు అత్యంత ప్రమాదకరమని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల మండలంలోని రుస్తుంబాదలో మామిడి చెట్టుకు గూడను ఏర్పాటు చేసినప్పుడు ఈ విషపు ఈగల గూడును తొలగించారు. గొంది గ్రామంలో ఇటీవల హేమీ కూలీకి ఈగలు కుట్టగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మృతి చెందారు. ఇటీవల పేరుపాలెంలో ఈగలు కారణంగా పశువులు చనిపోయిన ఘటన తెలిసిందే. ఈ ఈగల పట్టును తొలగించి రక్షణ కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


విషపు ఈగల గూడు..

నేరాలు - ఘోరాలు

పందెంరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని దగ్గులూరు గ్రామంలో కోడి పందెలు ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారినుంచి ఒక కోడి పుంజు, ఒక కత్తి, రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు రైటర్ సిహెచ్.మూర్తి తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ముంపులోనే వరిచేలు

కాలువ గట్లు పటిష్టపర్చని అధికారులు

దిక్కుతోచని స్థితిలో రైతన్నలు

నీట మునిగిన వరిచేలు

ప్రజాశక్తి - కాళ్ల

కెలంక ఛానల్ ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ కాలువలో నాలుగు చోట్ల గట్లు బలహీనంగా ఉన్నాయి. గత ప్రభుత్వం అలసత్వం వల్ల కాలువలో పూడిక పనులు చేయలేదు. బలహీనంగా ఉన్న గట్ల పటిష్ట పనులు చేయలేదని, ఈక్రమంలో తమను కూటమి ప్రభుత్వమే ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. కాలువలు ఉధృతంగా ప్రవహించడంతో వరిచేల పరిస్థితిని పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఇటీవల జిల్లా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వారం రోజుల క్రితం పరిశీలించారు. గట్లు పటిష్ట పరచాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలను అమలు చేయడంలో అటు ఇరిగేషన్, ఇటు రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వరిచేలు నీటమునిగి నాట్లు నీటిలో తుడిచిపెట్టుకుపోయాయని రైతులు, కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట చేలు నీటమునిగాయి. కనుచూపుమేర పంటచేలు చెరువులను తలపిస్తున్నాయి. కెలంక ఛానల్‌లో 500 ఎకరాల్లో కౌలు రైతులు వరిసాగు చేస్తున్నారు. వరద రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కాలువ గట్ల పటిష్ట పనులు అధికారులు చేయకపోవడంతో వర్షపునీరు పైకి ఎగదన్నుతోంది. నీరు బయటకు పోయే మార్గం లేక నాలుగు రోజులుగా వరినాట్లు నీటిలోనే నానుతున్నాయి. నాట్లు వేసిన చేలల్లో మునలు పైకి తేలుతుండటంతో రైతుల దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. పంట చేలన్నీ చెరువులను తలపిస్తున్నాయని, నారు కుళ్లిపోతే నష్టపోతామంటూ రైతులు, కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గట్టు బలహీనంగా ఉన్న కెలంక ఛానల్

పెర్కిపాలెంలో నిరంతర వైద్య శిబిరం ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - వీరవాసరం

పెర్కిపాలెంలో నిరంతర వైద్యశిబిరం ఏర్పాటు చేసి, వైద్య సేవలందించాలని సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి మండల వైద్యాధికారి తాజ్‌కు సోమవారం విజ్ఞప్తి చేశారు. పెర్కిపాలెంలో ప్రతీ ఏటా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయని, దీంతో నిరుపేదలు ప్రయివేటు వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారని అన్నారు. ఇప్పటికే గ్రామంలో అనేక మంది జ్వరాలతో బాధపడుతున్నారని తెలిపారు. గ్రామంలో నెలకొన్న అనారోగ్య పరిస్థితిని మండల వైద్యాధికారిణి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె తక్షణమే స్పందించారు. గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించాలని ఆదేశించారు. మూడు రోజుల క్రితం వైద్యశిబిరం ఏర్పాటు చేయగా కొంతమంది జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించామని వైద్య సిబ్బంది తెలిపారు. కొత్తగా జ్వరాలు వచ్చిన వారు లేరన్నారు. ఇప్పటికే జ్వరాలు సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పామన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా, పొడిగా ఉంచుకొని దోమలు, కలుషిత తాగునీరు వల్ల వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కలిగించినట్లు వైద్యసిబ్బంది తెలిపారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది

ఎంఎల్ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు 9వ తేదీ నుంచి మూడు రోజులపాటు విజయవాడ వరద బాధిత ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటిస్తున్నారు. తాడేపల్లిగూడెంతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి ఆహార పొట్లాలతోపాటు నిత్యవసర సరుకులు అందించేందుకు జనసేన నాయకులతో పాటు టిడిపి, బిజెపి నేతలు చేస్తున్న సాయం మరువలేమన్నారు. విజయవాడలోని సింగ్‌నగర్, ప్రకాష్ నగర్, పాయకాపురం, రాజీవ్ కాలనీ, బుడమేరు మునక ప్రాంతాల్లో ఆయన ట్రాక్టర్‌పై పర్యటించారు. అనంతరం వరద బాధితులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 25 కేజీల బియ్యం, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, నిత్యవసర సరుకులు స్వయంగా ఇంటింటికీ తిరిగి వారికి అందజేశారు.

డిఆర్‌యుసిసి సభ్యునిగా కుమార్

ప్రజాశక్తి - పాలకొల్లు

గత పదవీకాలంలో దక్షిణ మధ్య రైల్వే విజయవాడ జోన్ డిఆర్‌యుసిసి సభ్యునిగా జక్కంపూడి కుమార్ చేసిన సేవలను గుర్తించి మరొక పర్యాయం తన సేవలు అవసరమని విజయవాడ జోన్ అధికారులు డిఆర్‌యుసిసిగా రెండవసారి బాధ్యతలను జక్కంపూడి కుమార్‌కు అప్పగించారు. రెండవసారి సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ జోన్ డిఆర్‌యుసిసి బాధ్యతలు స్వీకరించబోతున్న జక్కంపూడి కుమార్‌కు పాలకొల్లు చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షులు కారుమూరి నరసింహారావు సోమవారం జరిగిన గవర్నింగ్ సభ్యుల సమావేశంలో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ సెక్రటరీ కనుమూరి సీతారామరాజు, కోశాధికారి మామిడి వెంకటేశ్వరరావు, ఛాంబర్ గౌరవ అధ్యక్షులు గున్నం సర్వారావు, అన్ని సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు అభినందించారు.

తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న సిఐటియు నాయకులు

ఆయాల అక్రమ తొలగింపులు ఆపాలి

సిఐటియు ఆధ్వర్యాన తహశీల్దార్‌కు వినతి

పెనుగొండ: పాఠశాలలు మొదలై ఐదు నెలల తర్వాత పాఠశాలలను శుభ్రపరిచే ఆయాలను తొలగించడం అన్యాయమని సిఐటియు ఆధ్వర్యంలో పెనుగొండ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఆయాలకు ఇవ్వవలసిన వేతన బకాయిలు చెల్లించకుండా అక్రమ తొలగింపు ఆపాలని పెనుగొండ ఎంఇఒ కార్యాలయం వద్ద ఎంఇఒ సుభాకర్‌కు వినతిపత్రం అందించే ప్రయత్నం చేయగా డివైఇఒకి, హై స్కూల్ హెడ్ మాస్టర్‌కి ఇవ్వాలని సూచించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ బి.అనిత కుమారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎంఇఒ సుభాకర్ వైఖరి ఏవిధంగా ఉందో తెలియజేశారు. వడలి ఉన్నత పాఠశాల నుంచి ఐదు నెలలు గడిచిన తర్వాత హైస్కూల్ ఆయా మొల్లు నాగవేణిని తొలగించడం అన్యాయమని, ప్రభుత్వం కార్మికులకు ఆగస్టు నెల వరకు ఉన్న వేతన బకాయిలు చెల్లించకుండా తొలగించడం దుర్మార్గమన్నారు. కనీసం తొలగింపు నోటీసు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు షేక్ పాదుషా, నీలాపు ఆదినారాయణ, శీలం ఏసు, పాఠశాల ఆయాలు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి, ఎంఎల్ఎలకు సత్కారం

భీమవరం టౌన్: 'ది భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్' వారు భీమవరంలో నిర్వహించిన 'అభినందన గౌరవ ఆత్మీయ సత్కార మహోత్సవం'లో సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన ఎంపీలు, ఎంఎల్ఎలను సత్కరించారు. ఆదివారం కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌లతోపాటు పలువురు రాజకీయ ప్రముఖులకు 'ది భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్' ఘనంగా సన్మానం చేశారు.

వరద బాధితులకు సహాయం అందించాలి

దాట్ల శ్రీదేవి ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రతి ఒక్కరూ మానవత్వంతో స్పందించి తమ శక్తి మేర వరద బాధితులకు సహాయం అందించాలని దాట్ల శ్రీదేవి ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు పిలుపునిచ్చారు. విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు ముందుకు వచ్చారు. 504 వాటర్ బాటిళ్లను కాళ్ల తహశీల్దార్ కార్యాలయంలో ట్రస్ట్ సభ్యులు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెన్మెత్స నాగరాజు, ఈదా భోగేష్ పాల్గొన్నారు.

వాటర్ బాటిల్స్ అందించిన ట్రస్ట్ అధినేత వెంకటరామరాజు

డిఎస్‌పి మురళీకృష్ణను కలిసిన రామరాజు

డిఎస్‌పికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామరాజు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం నూతన డిఎస్‌పి మురళీకృష్ణను సోమవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం లా అండ్ ఆర్డర్ విషయాలపై చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, కొప్పాడ రవి, వాతాడి ఉమా, షేక్ హుస్సేన్, నాగిడి రాంబాబు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధికి విరాళం

ప్రజాశక్తి - గణపవరం

విజయవాడ వరద బాధితుల సహాయార్థం వల్లూరు జనసేన అధ్యక్షులు కొండవీటి వీరభద్రరావు ఆధ్వర్యంలో సోమవారం ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజుకి రూ.50 వేల చెక్కును అందజేశారు. వరద బాధితులకు తమవంతు కర్తవ్యంగా స్థానిక టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు కృషి చేసినట్లు వీరభద్రరావు అన్నారు. బాధితులకు అండగా నిలిచిన కూటమి కార్యకర్తలను ఎంఎల్ఎ ధర్మరాజు అభినందించారు.

వీరవాసరం : తహశీల్దార్‌కు సాయం అందిస్తున్న చిన్నారులు

చిన్నారుల సాయం

వీరవాసరం : విజయవాడ వరద బాధితుల నిమిత్తం ప్రభుత్వానికి ఇద్దరు చిన్నారులు వరద సహాయం అందజేసి ఆదర్శంగా నిలిచారు. వీరవాసరం గ్రామానికి చెందిన దొడ్డిపట్ల సుబ్బారావు కుమారులు సత్యసాయిదుర్గ, పవన్‌నాగతరుణ్‌లు తమ ఇంటి చుట్టుపక్కల వారి నుంచి రూ.1030 సేకరించి సోమవారం తహశీల్దార్ ఎవి.రామాంజనేయులకు అందజేశారు. ఇటువంటి ఆదర్శవంతమైన ఆలోచనను కలిగిన చిన్నారులను తహశీల్దార్ అభినందించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మరి కొంత మంది ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.

అంగర రూ.5 లక్షల విరాళం

పాలకొల్లు : విజయవాడ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ విజయవాడ వరద బాధితుల సహాయ నిమిత్తం రూ.5 లక్షల చెక్‌ను అందజేశారు. వరదల సమయంలో మీరు పడే శ్రమ ముందు మా సహాయాలు పెద్ద లెక్క కాదు అని ఈ సందర్భంగా అంగర పేర్కొన్నారు.

తణుకు : విజయవాడ నగరాన్ని ప్రకృతి విపత్తుతో అనేక కుటుంబాల జీవితాలను కుదిపేసిన ఈ క్లిష్ట సమయంలో విజయవాడ ప్రజలకు అండగా నిలబడటంలో సింగపూర్‌లో నివసించే తెలుగు ప్రజలు ఆర్థిక సహాయంతో ముందుండటం మనకు గర్వకారణమని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. వరద బాధితుల సహాయార్థం సోమవారం విజయవాడ కలెక్టరేట్‌లో తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణతో కలిసి రూ.17.5 లక్షల చెక్కును ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ దాతృత్వంతో సహకరించిన సింగపూర్‌లో నివసించే ప్రవాస తెలుగు వారు బొబ్బా రాజాచౌదరి, సతీష్ పారేపల్లి, రాధికప్రసాద్‌లకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలియజేశారు. అంతకు ముందు విజయవాడ 32వ డివిజన్ అయోధ్య నగర్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో జరుగుతున్న శానిటేషన్ పనులను ఆయన స్వయంగా పరిశీలించి అనంతరం వరద నష్టంపై జరుగుతున్న ఎన్యూమరేషన్ నమోదు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

మొగల్తూరు : వరద బాధితుల సహాయార్థం దాతలు ఆర్థిక సహాయం అందించేందుకు సోమవారం ముందుకు వచ్చారు. మోడీ, ముత్యాలపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.37,850 నగదును సమకూర్చారు. ఆ నగదును డిడి తీసి తహశీల్దార్ సిహెచ్.విద్యావతికి అందించారు. విఆర్ఒ సుజాత ఉన్నారు.

ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి

గణపవరం : అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మారుతున్న వాతావరణం కారణంగా ప్రతి గ్రామంలో వైరల్, టైఫాయిడ్ ఫీవర్లు, డెంగీ జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున అందరూ జాగ్రత్తగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ పి.కనక ప్రియ తెలిపారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ పలు జాగ్రత్తల గురించి వివరించారు. ఇంటి పరిసరాలలో మురుగునీరు నిలవ లేకుండా చూసుకోవాలని, ఇంటి పరిసరాలలో రుబ్బురోలు, రబ్బరు టైర్లు, వాడి పడేసిన కొబ్బరిబొండాలు, గ్లాసులు, ఇంటి లోపల ఫ్రిజ్, కూలర్‌లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అంతా తప్పనిసరిగా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, వేడివేడి పదార్థాలు తినాలని సూచించారు. పొలమూరు గ్రామంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ప్రతిరోజూ ఆరోగ్య సిబ్బందితో ఇంటింటికీ ఫీవర్ సర్వేలను చేయిస్తున్నట్టు వారు పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లోనూ ఫస్ట్ ఎయిడ్ క్యాంపులను నిర్వహించుచున్నామని, పెనుమంట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజు డెంగీ, టైఫాయిడ్, మలేరియా, ఇతర టెస్టులను అందరికీ ఉచితంగా చేస్తున్నామని వారు వెల్లడించారు.

గణపవరం: గణపవరం నాలుగవ శిచివాలయం పరిధిలోని స్థానికులకు ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గణపవరం పిహెచ్‌సి వైద్యులు పి.కిరణ్మయి, మలేరియా తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వైవి.లక్షణరావు మాట్లాడుతూ వర్షాకాలం వ్యాధులు ప్రబలే కాలమని అన్నారు. ప్రజాభాగస్వామ్యంతో అడ్డుకట్టవేయాలని కోరారు. ప్రతి ఇంటికీ వెళ్లి జ్వరపీడుతులు ఉన్నది, లేనిది అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫ్రైడే డ్రైడేపై జరుగుతున్న తీరుతెన్నులను ప్రజలని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజారోగ్యంపై అవగాహన కల్పించడానికి ర్యాలీ నిర్వహించారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు విషయాలు వివరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు, ఆరోగ్య సహాయకులు ఎ.కృష్ణ, శ్రీనివాసరావు, యేహాన్, ఎం.నల్లయ్య, ఆశాలు పాల్గొన్నారు.

కూరగాయల ధరల నియంత్రణకు చర్యలు

జెసి రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

బహిరంగ మార్కెట్లో కూరగాయల ధరలు నియంత్రించేందుకు తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా జాయింట్ మార్కెటింగ్, సివిల్ సప్లైస్, బియ్యం, కందిపప్పు హోల్ సేల్ అసోసియేషన్‌తో సమావేశమై సమీక్షించి మాట్లాడారు. బహిరంగ మార్కెట్లో కూరగాయల ధరలు స్థిరీకరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఉల్లిపాయలు, బంగాళదుంపలు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు దృష్టికి వచ్చినట్లు తెలిపారు. హోల్‌సేల్ రేట్లకే అన్ని షాపుల్లో ఒకే విధమైన ధరకు అమ్మేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత నెల రోజులుగా జిల్లాలో కురుస్తున్న అధిక వర్షాల కారణంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని కూరగాయలు, ఉల్లిపాయలు, బంగాళదుంపలను అందుబాటు ధరల్లో విక్రయించేలా చూడాలన్నారు. రానున్న రెండు రోజుల్లో అమ్మకం ధరల్లో తప్పకుండా మార్పు రావాలని, లేని పక్షంలో నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి కె.సునిల్ కుమార్, భీమవరం రైతు బజార్ ఎస్టేట్ అధికారి పి.కళ్యాణ్, డిఎస్ఒ ఎన్.సరోజ, సిపిఒ ఎం.మోహన్ రావు, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాత రాణి, జిల్లాలోని బియ్యం, కందిపప్పు హోల్ సేలర్స్ అసోసియేషన్స్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

MY NAME : **GURRALA ANIL KUMAR**
FATHER : **VEERASWAMY GURRALA**
MOTHER : **RANAMMA GURRALA**
Address: 2-6A, 2nd Road Rani Nivasam, 27th Division, Raja Rajeswari Nagar, Tangellamudi, Eluru-534005.
Last Time Issued With Spelling in Correct As per the Documents it Should be **Ranamma** Kindly Do the Same Changes as per Original Documents

పాస్‌పోర్టు పోయినది

మల్లుల త్రిమూర్తులు తండ్రి : శ్రీనివాసరావు అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. ఇంటి నుండి జిరాక్స్ సెంటర్‌కు వెళ్తుండగా నాయొక్క పాస్పోర్ట్ పోయింది. పాస్పోర్ట్ నెంబర్ : **L9025180** గల పాస్పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు

అడ్రస్:
మల్లుల త్రిమూర్తులు
తండ్రి : శ్రీనివాసరావు, డోర్ నెంబర్ : 2-118,
బండివారిపాలెం, గుమ్ములూరు పోస్ట్,
గుమ్ములూరు, పోడూరు మండలం
ఆంధ్రప్రదేశ్, ప.గో. జిల్లా, పిన్ : 534267
సెల్ : 8985448979

పోయినవి

తాడేపల్లిగూడెం డో.నెం. 1-28ı6/1, కడకట్ల 31వ వార్డు కాపురస్తులు మొక్కరాల శ్రీనివాసరావు అను నేను నాకు కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్‌లో అకౌంట్ కలదు. అకౌంట్ నెంబర్: 24140026441. ఈ అకౌంట్‌కు సంబంధించిన చెక్ బుక్ బ్యాంక్ పాస్‌బుక్ ఉన్న బ్యాగ్ నేను బ్యాంక్‌కు వెళుతుండగా 10 రోజులు క్రిందట నా బ్యాగ్ పడిపోయినది. **చెక్ నెంబర్లు: 035801, 035802, 035803, 035804.** ఆ బ్యాగ్‌లో ఈ నెంబర్ గల చెక్‌లు ఉన్నవి. నేను వెళ్లిన మార్గములో ఎంత వెతికినను ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికినచో మాకు సంప్రదించవలసినదిగా కోరుతున్నాను.

నా సెల్ నెంబర్: **9848025818**

CHANGE OF NAME

I, GADIRAJU VENKATA SEETA RAMA KRISHNAM RAJU, S/o **Gadiraju Surpa Raju,** R/o Flat No.301, Sainadh Appartment, Steamer Road, Near Tailor High School, Narasapuram, W.G.Dist., A.P.,
My daughter, **HEMA RAMYA GADIRAJU,** in her SSC certificate, her father's name was wrongly registered as **'RAMA KRISHNAM RAJU'** instead of **'GADIRAJU VENKATA SEETA RAMA KRISHNAM RAJU'.** Her father's correct name is **'GADIRAJU VENKATA SEETA RAMA KRISHNAM RAJU'.**

In the Court of the IInd Addl. Judicial Ist Class Magistrate, Bhimavaram
O.S. No. 500/2022

Between:
Plaintiff:
Andhra Bank, Amangamated into Union Bank of India, Tundurru Branch, Rep. by its Branch Manager.
Defendants:
1. Rayudu Devi Durga
2. Gubbala Veera Satyanarayana

పై నెంబరు దావాలో ప్రతివాద్లుకు ఎన్నిసార్లు సమన్లు పంపినను అవి అందుకోకుండా కాలయాపన చేయుచున్నారు. వాది శ్రీ కోర్టు వార్కి ప్రతివాద్లుపై పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేయగా సదరు కోర్టు వారు I.A. No. 157/2024 ద్వారా ఆర్డరు వేసినారు. ప్రతివాద్లు **ది. 04-10-2024వ తేదీన గం॥ 10.30 ని॥లకు** కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను. లేని ఎడల శ్రీ కోర్టు వారు మీపై Exparte ఉత్తర్వులు జారీ చేయగలరని తెలియజేయుచున్నాము.

ఆల్తి శివరామకృష్ణ
అడ్వకేట్, శ్రీరాంపురం
భీమవరం-2
సెల్: 9848460585
భీమవరం
9-9-2024